త్యాగానికి ప్రతీక బక్రీద్



అలంపూర్ మండలం బుక్కాపురంలో వేడుకల్లో ఎమ్మెల్యే విజయుడు



అయిజలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



ధరూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శాంతినగర్‌లో ముస్లింలకు సందేశం వినిపిస్తున్న మౌలానా

- ఈద్గా, మసీద్‌లలో ప్రార్థన
- బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకోని ముందుగానే ముస్తాబు చేసిన ఈద్గాలు, మసీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. పట్టణాల్లో, గ్రామాల్లో పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు మతసామరస్యాన్ని చాటుతూ ఒకరినొకరు అలింగనం చేసుకోని పండుగ శుంభాకాంక్షలు తెలుపుకున్నారు. అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామంలో ఎమ్మెల్యే విజయుడు బక్రీద్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.

ధరూరు: త్యాగం, సహనానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వ దినాన్ని పురస్కరించుకుని మండలంలో ముస్లింలు ప్రత్యేక పార్థన చేశారు. మండల కేంద్రంతో పాటు ఉప్పేరు, ర్యాలంపాడు, మార్లబీడు, మన్నాపురం, నెట్టెంపాడు, చింతరేవుల తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు.ఈ సందర్భంగా చిన్నలు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అయిజ: మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పండుగ రోజు పేదలకు దాన ధర్మాలు చేయాలనే ధ్యేయంతో నిర్వహించే పండుగ బక్రీద్ అన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు ప్రత్యేకంగా తయారు చేసిన వంటలను ఆరగించారు.

శాంతినగర్: త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లోని శ్మశాన వాటికల్లోకి వెళ్లి వారి పూర్వీకులను తలచుకుని దువా చదివారు. శాంతినగర్ ఈద్గా వద్ద మౌలానా అల్లా సందేశాన్ని ముస్లింలకు వినిపించి దానాలు చేసి ఆశీర్వాదం పొందాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆలింగనం చేసుకున్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్‌ను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఈద్గా వద్ద ముస్లింలు, చిన్నారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రాజోళి: మండలంతో పాటు ఆయా గ్రామాల్లో బక్రీద్ పండుగ ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో సరదాగా గడిపారు.



రాజోళిలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



గట్టులో ఈద్గా దగ్గర ప్రార్థన చేస్తున్న ముస్లింలు

బక్రీద్ సంబురాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో బక్రీద్ పండుగ సంబురాలు ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఈద్గాల దగ్గరకు ప్రత్యేక ప్రార్థన చేశారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేసి ఘనంగా బక్రీద్ వేడుకలు నిర్వహించారు. త్యాగానికి గుర్తుగా నిర్వహించే ఈ పండుగ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జాలి, దయ, కరుణ అనే స్ఫూర్తిని నింపుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో..



మానవపాడులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

బక్రీద్ పండుగ వేడుకలు

గట్టు: మండల కేంద్రంలోని చెరువు దగ్గర ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బల్గెర హనుమంతు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహబూబ్‌పాషలు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌వాహెబ్, జాఫర్, మహబూబ్‌పాష, నన్నేసాబ్, దస్తగిరి, ఖాజా, ఇస్మాయిల్, జుబేర్, రజాక్, బురానొద్దీన్ పాల్గొన్నారు.



ఉండవెల్లిలో చిన్నారుల అలింగనం





ఉండవెల్లిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు.. బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



శాంతినగర్ స్మశాన వాటికలో పెద్దల కోసం దువా చదువుతున్న ముస్లిం



ధరూరులో ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువకులు,



అయిజలో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

క్లుప్తంగా

నాగాభరణం అందజేత



రాజోళి: మండల కేంద్రంలోని కురువపేటలో ఉన్న బీరప్ప దేవాలయానికి సోమవారం నాగాభరణం దారపాత్ర అందజేశారు. బడికిరి కేశవులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీదేవమ్మ రూ.10వేల విలువ చేసే ఆభరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రహదారులకు ఎర్రమట్టి



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్, వడ్డేపల్లిలోని గుంతలమయమైన రహదారులను ఎర్రమట్టి వేసి చదును చేసే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. జేసీబీ, ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తరలించి రోడ్లపై వర్షపునీరు, మురుగు నిల్వ ఉండే ప్రాంతాల్లో వేసి చదును చేస్తున్నారు. దీంతో వాహనదారులకు, పట్టణ ప్రజలకు కొంతవరకు రహదారి సమస్యలు తీరనున్నాయి. గుంతలను పూడ్చే పనులను మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డుల్లో చేపట్టి వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి సౌకర్యం కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయండి



అయిజ: కర్నూల్–అయిజ రోడ్డు రహదారిలో పెద్దవాగుపై గతంలో నిర్మించిన వంతెనకు రక్షణ గోడను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం బ్రిడ్జికి ఇరువైపుల ఏర్పాటు చేసిన రాళ్లు శిథిలమై అనేక సంవత్సరాలవుతోంది. అక్కడ అనేక సార్లు ప్రమాదాలు సంభవించాయి. బ్రిడ్జి పక్కన కిందిభాగంలో ఏర్పాటు చేసిన రాతిగోడ నెర్రెలుబారింది. బ్రిడ్జి ఉన్నట్లు సూచించే రక్షణ రాళ్లు విరిగిపోయాయి. వాహనాలు దగ్గరకు వస్తేగాని చోదకులకు అక్కడ ప్రమాదం ఉందని తెలియడంలేదు. అధిక బరువు కలిగిన వాహనాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తుంటాయి. ఈరోడ్డుపై ప్రతినిత్యం పరిమితికి మించిన బరువుతో వాహనాలు వెళ్తూనే ఉన్నాయి. దాంతో బ్రిడ్జి బీటలుబారింది. అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపుల రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



అయిజ: పట్టణ సమీపంలో కర్నూలు–రాయచూర్ రోడ్డుపై ఏర్పాటు చేసిన వంతెనకు రంధ్రాలు పడి ప్రమాదకరంగా మారాయి. గతంలో అనేక సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమైంది. వంతెన శిథిలమై ఎన్నో సంవత్సరాలు అవుతున్నా నూ తన బ్రిడ్జిని నిర్మించకపోవడంతో వంతెనపై ఏర్పడిన రంధ్రాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా యి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోకముందే శిథిలమైన వంతెనను తొలగించి, నూతన వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

గట్టు: కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సామాజిక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సామాజిక శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సామాజిక శిక్షణా తరగతులను వాల్మీకి కమ్యూనిటీ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు బజారన్న, భీమన్న, తాయన్న, రెడ్డప్ప, దావీదు, రవి తదితరులు పాల్గొన్నారు.



గట్టులో కరపత్రాలు విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



శివునికి అభిషేకం చేస్తున్న భక్తుడు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి వివిధ అభిషేకాలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి శివునికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రాజోళిలో ప్రత్యేక పూజలు..

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో కొలువైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. రాజోళితో పాటు ఆయా గ్రామాల ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులకు పంటలు సుభిక్షంగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు.

పట్టపగలే చోరీ

గట్టు: మండల కేంద్రంలో సోమవారం పట్టపగలు భారీ చోరీ చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గట్టు గ్రామానికి చెందిన కుర్వ బుడ్డ నర్సింహులు గట్టు రైతు వేదిక సమీపంలో గంగిమాన్‌దొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో కొత్త ఇంటిని నిర్మించాడు. కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలానికి వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, 24 తులాల వెండితో పాటు వెండి దావు, రూ.లక్షా 20 వేల నగదును దోచుకెళ్లారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఇంటి తలుపులకు తాళం విరగొట్టి ఉన్న విషయాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. గద్వాల సీఐ భీంకుమార్, ఎస్‌ఐ రామకృష్ణలు వివరాలు నమోదు చేసుకున్నారు. కుటుంబ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్లతో రైతులకు అద్దెభారం

- గంటకు రూ.1000 నుంచి రూ.1200 వరకు అద్దె
- వ్యవసాయంలో పెరిగిన వినియోగం
- అన్నదాతకు దూరమవుతున్న కాడెడ్లు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కేటీదొడ్డి: ఆధునిక వ్యవసాయంలో భాగంగా రైతులు సాగు పనుల కోసం ఎక్కువగా ట్రాక్టర్ల మీద ఆధారపడుతున్నారు. సరైన పశుగ్రాసం లేకపోవడం, ఇతర కారణాలతో రైతులు తమ పశువులను పోషించలేక అమ్ముకున్నారు. ప్రస్తుతం వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు కాడెడ్లు లేకపోవడంతో అధికశాతం ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. రైతులకు ట్రాక్టర్ల అద్దె భారంగా మారింది.

గంటకు రూ.1000 పైనే..

వర్షాభావ పరిస్థితుల కారణంగా వేసవిలో పశువులకు సరైన పశుగ్రాసం లేక పశువుల పోషణ భారమై రైతులు పశువులను సంతల్లో విక్రయించారు. పశువుల సంతతి రోజురోజుకూ తగ్గిపోవడంతో వ్యవసాయానికి కాడెడ్లు లభించకపోవడంతో రైతులు ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ట్రాక్టర్ల యజమానులు గంటకు రూ.1000 నుంచి రూ. 1200 వరకు అద్దె డిమాండ్ చేస్తున్నారు. గత్యంతరం లేక రైతులు అద్దెభారాన్ని మోస్తూ ట్రాక్టర్లను వినియోగించుకోక తప్పడం లేదు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల ధరలకు తోడు వ్యవసాయ కూలీల రేట్లు కూడా గణనీయంగా పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 35 వేల ఎకరాల్లో 30 వేల ఎకరాల్లో వరి, పత్తి, పంటలను 5 వేల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

ఆర్థిక భారమైనా తప్పడం లేదు..



యంత్రాల ద్వారా పంట చేన్లలో పనులు చేయించడం ఆర్థికంగా భారమైనప్పటికీ తప్పడం లేదు. గ్రామాల్లో కూలీల కొరత తీవ్రంగా ఉండడం ద్వారా తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాక్టర్ల ద్వారా పనులు చేపట్టి వ్యవసాయం చేస్తున్నాం. పశుసంపతి కూడా రోజురోజుకు తగ్గుతుండడంతో ట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది.

– కోళ్ల రంగప్ప, గువ్వలదిన్నె

అద్దె భారం పెరుగుతోంది..



ట్రాక్టర్లు, యంత్రాలు ద్వారా పనులు చేపట్టడం వల్ల అద్దె భారం కొంత మేరకు పెరుగుతున్నప్పటికీ త్వరగతిన పనులు పూర్తవుతున్నాయి. గ్రామాల్లో పశుపోషణ పూర్తిగా తగ్గడంతో వ్యవసాయానికి సరిపడే కాడెడ్లు దొరకడం లేదు.

– వెంకటేష్ నాయక్, రైతు, గువ్వలదిన్నె

పెరుగుతున్న ఖర్చులు..

వ్యవసాయంలో రోజురోజుకు యాంత్రీకరణ వినియోగం పెరుగుతోంది. వ్యవసాయం పనుల్లో దాదాపుగా అన్నింటికి ట్రాక్టర్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. గతంలో గ్రామానికి ఒక్క ట్రాక్టర్ ఉంటే నేడు ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడంలో భాగంగా రాయితీపై ట్రాక్టర్లను అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయంలో ముఖ్య పాత్ర పోషించే కాడెద్దుల ప్రాధాన్యత పూర్తిగా తగ్గుతూ వస్తోంది. అప్పట్లో ప్రతి గ్రామంలో 90 శాతం మంది రైతుల కుటుంబాల్లో కూడా ఎడ్లు ఉండగా ప్రస్తుతం 50 శాతం కుటుంబాల్లో కనిపించడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.200 నుంచి రూ.300 వరకు అద్దెలు పెరిగాయి. గతేడాది కల్టివేటర్ గంటకు రూ.600 ఉండగా, ప్రస్తుతం రూ.800 కు పెరిగింది. రోటవేటర్ గతేడాది ఎకరానికి రూ.900 ఉంటే ప్రస్తుతం రూ.1200 పెంచారు. విత్తనాలు వేయడానికి ఒక్కో బ్యాగుకు గతేడాది రూ.400 ఉంటే ప్రస్తుతం రూ.600 వరకు ట్రాక్టర్ల యజమానులు తీసుకుంటున్నారు. కాడెడ్ల ద్వారా ఒకరోజుకు విత్తనాలు వేయడానికి గతేడాది రూ.1000 ఉంటే ప్రస్తుతం రూ.1400 వరకు అద్దె తీసుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పంటపొలాల్లో మహిళా కూలీలు విత్తనాలు విత్తడానికి గతేడాది రోజు కూలీ రూ.200 ఉంటే ఇప్పుడు రూ. 300 వరకు పెరిగింది. పురుషులకు రూ. 300 నుంచి రూ.400 వరకు పెరిగిందని రైతులు చెబుతున్నారు.



ఉమిత్యాల శివారులో పొలం దున్నుతున్న రైతు

పూలచెట్లతో అందంగా రహదారి

పెద్దపోతులపాడు నుంచి మానవపాడు వచ్చే రహదారి పూలచెట్లతో ఆకర్షనీయంగా, అందంగా చూపారులను అకట్టుకుంటోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పచ్చదనంతో చెట్లు పూలాకర్షణతో రోడ్డుకు ఇరువైపులా అందగా కనిపిస్తోంది. ఈ రహదారిలో వాహనదారులు, ప్రయాణికులకు అహ్లాదాన్ని పంచుతోంది.

– మానవపాడు



పెద్దపోతులపాడు రోడ్డు గుండా ఆకర్షణీయంగా ఉన్న పూలచెట్లు